

సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 36,531 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 30,411 క్యూసెక్కులు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 37,760 క్యూసెక్కులు వదులుతున్నారు.

రేపు అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డు సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. భక్తులకు గ్రామస్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

అక్షరంపై ఆంక్షలా సిగ్గు.. సిగ్గు !

- మండిపడ్డ పాత్రికేయులు
- ఆర్డీఓ కార్యాలయాల వద్ద నిరసన
- సాక్షిపై దాడి ప్రజాస్వామ్యానికే చేటు
- ఎడిటర్ ధనంజయరెడ్డిపై పోలీసుల వేధింపులు ఆపాలి

అక్షరంపై ఆంక్షలు నిరసిస్తూ పాత్రికేయలోకం గర్జించింది. కూటమి ప్రభుత్వ నిరంకుశత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా నిలిచే పత్రికలపై దాడిని ఖండించింది. రాజ్యాంగం ప్రసాదించిన భావప్రకటన స్వేచ్ఛపై కూటమి ప్రభుత్వ దాడిని ఎండగట్టింది. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డిపై కేసులు నమోదు చేయడాన్ని నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా పాత్రికేయులు శుక్రవారం కదం తొక్కారు. ప్రజల గొంతుగా నిలిచే పత్రికల గొంతు నొక్కడం, పత్రికా స్వేచ్ఛపై దాడి చేయడం ప్రజాస్వామ్యానికే చేటని నిరసన తెలిపారు.



చీరాల: ప్రజల గొంతుకై వార్తా కథనాలను ప్రచురిస్తున్న 'సాక్షి' మీడియాపై కూటమి ప్రభుత్వం కక్ష కట్టిందని, పత్రికా స్వేచ్ఛను హరిస్తూ పోలీసుల వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయమని పలువురు జర్నలిస్టులు పేర్కొన్నారు. రాజ్యాంగ హక్కులను, పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ సాక్షి ఎడిటర్ ఆర్. ధనంజయరెడ్డికి పోలీసులు నోటీసుల పేరుతో వేధింపులు, సాక్షి జర్నలిస్టులపై అక్రమంగా కేసులు నమోదు చేయడంపై చీరాల జర్నలిస్టుల ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. చీరాల ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఆర్డీఓ చంద్రశేఖర్ నాయుడుకి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జరుగుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు, అన్యాయాలు, హత్యలు, లైంగిక దాడులపై నిరంతరం సాక్షి వార్తా కథనాలను ప్రచురిస్తోందని తెలిపారు. రాష్ట్రంలో వెలుగు చూసిన నకిలీ మద్యం కుంభకోణాన్ని కూడా ఆధారాలతో ప్రచురించడంపై కూటమి ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల ద్వారా సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, బ్యూరో ఇన్‌చార్జులను నోటీసులు పేరుతో వేధింపులకు గురిచేస్తోందని విమర్శించారు. పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేస్తున్నట్లు జరుగుతున్న ఈ కక్ష సాధింపు చర్యలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఐజేయూ సభ్యులు ఎన్.శేషసాయి, ఏపీయూడబ్ల్యూజే స్టేట్ కౌన్సిల్ మల్లా చంద్రశేఖర్, ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు కొప్పుల వాసుబాబు, జర్నలిస్టులు పి.కృష్ణ చైతన్య, బి.గురునాథం, డి.శ్రీధర్‌రెడ్డి, ఎస్‌వీ కృష్ణారెడ్డి, కె.సురేష్, కె.వాసు, రాగదీప్, జి.సూర్యప్రకాష్, జి.మహేష్, ఎస్.స్వామినాథ్‌రెడ్డి, టి.ప్రదీప్ పాల్గొన్నారు.



చీరాల ఆర్డీఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు



బాపట్ల కలెక్టరేట్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జర్నలిస్టులు

అక్రమ కేసులు ఎత్తివేయాలి

బాపట్ల : సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డితోపాటు విలేకరులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ జర్నలిస్టుల ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు.ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ పత్రికా స్వేచ్ఛను కాలరాస్తూ కూటమి ప్రభుత్వం తప్పుడు కేసులు పెడుతోందని దుయ్యబట్టారు. ప్రజాస్వామ్యాన్ని కించపరుస్తూ, వాక్ స్వాతంత్ర్యాన్ని హరించే విధంగా కూటమి పాలన కొనసాగుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్‌గౌడ్‌కు అసోసియేషన్ నాయకులు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు బి.రమణారెడ్డి, కోటి ఉమామహేశ్వరరావు, వి.రాఘవ, ఎం.అంజయ్య, పరిశా వెంకట్, చంటి, చీమల దిన్నె నారాయణరావు, చిన్నం లక్ష్మీనారాయణ, పులిపాటి రాజు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

త్రికోటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.59 లక్షలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 59,97,254 ఆదాయం లభించినట్లు ఈవో డి.చంద్రశేఖర్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం లెక్కింపు నిర్వహించారు. హుండీల ద్వారా రూ.55,76,935, అన్నదానం హుండీల ద్వారా రూ.4,20,319 లభించినట్లు వివరించారు. నగదుతో పాటు బంగారం 51.500 గ్రాములు, వెండి 330 గ్రాములు, విదేశీ కరెన్సీ 96 అమెరికన్ డాలర్లు, 140 కెనడా డాలర్లు, 100 యూఏఈ డాలర్లు లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపును ఆలయ ఈవో డి. చంద్రశేఖరరావు, దేవదాయ శాఖ ఆభరణాల తనిఖీ అధికారి పి.సైదమ్మ బాయి పర్యవేక్షించారు.

నెలాఖరులోగా పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు

నరసరావుపేట: నవంబరు మొదటి వారం నుంచి పత్తి కోతలు మొదలవుతున్నందున ఈనెలాఖరులోగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే సీసీఐ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో సీసీఐ ప్రతినిధులు, జిల్లా అగ్రికల్చరల్ ట్రేడ్ మార్కెటింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రైతుల వెసులుబాటుకు కాపాస్ కిసాన్ మొబైల్ యాప్‌ను సీసీఐ ప్రవేశపెట్టిందన్నారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు పత్తి మద్దతు ధరలు, నాణ్యతా ప్రమాణాలు, యాప్ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ-పంట నమోదు వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా అగ్రి ట్రేడ్ మార్కెటింగ్ అధికారి కేవీఎస్ ఉపేంద్రకుమార్, జిల్లా ఫైర్ అధికారి వి.హనుమంతరావు, సీసీఐ బయ్యర్లు, పోలీసు అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శులు, పత్తి రైతులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ



యడ్లపాడు: ఎస్సీ, ఎస్టీ కేసును నరసరావుపేట డీఎస్పీ పి. హనుమంతరావు శుక్రవారం విచారించారు. ఇటీవల యడ్లపాడు గ్రామంలోని విజయదుర్గ వైన్స్‌లో పనిచేస్తున్న యువకుడిపై దాడి జరిగిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ(పీవోఏ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండో దశ దర్యాప్తులో భాగంగా డీఎస్పీ యడ్లపాడు ఎస్ఐ టి. శివరామకృష్ణతో కలసి వైన్స్ వద్దకు వెళ్లి స్వయంగా వివాదానికి సంబంధించిన అంశాలను రికార్డు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు పాల్గొన్నారు.

రూ.కోట్ల విలువైన భూమికి డబుల్ రిజిస్ట్రేషన్

- యజమాని ఫిర్యాదుతో వెలుగులోకి అక్రమం

పెదకాకాని: రూ.కోట్ల విలువైన భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామానికి చెందిన ఆట్ల వెంకటరెడ్డికి సర్వే నంబరు 66-1బీలో 72 సెంట్ల భూమి ఉంది. కుటుంబ అవసరాల కోసం దాన్ని విక్రయించాడు. కొంతకాలానికి ఆయన మరణించాడు. తరువాత ఆయన భార్య ఈశ్వరమ్మ, కుమారుడు బాలకృష్ణారెడ్డి, కుమార్తెలు తియ్యగూర హరికృష్ణ, భవనం గీతాకృష్ణలు చక్రం తిప్పారు. కొందరు రియల్ ఎస్టేట్ మీడియేటర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలోని విక్రయానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ఫోర్జరీ సంతకాలతో తాడేపల్లిగూడెం రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేయించారు. ఆ భూమిని మీడియేటర్లు పచ్చా తిరుమలకృష్ణ, ప్రతాప్ సురేష్‌కుమార్, ఫక్రుద్దీన్ అహ్మద్‌లతో కలసి రూ. 60 లక్షలకు అమ్మారు. వాస్తవానికి గుంటూరు శ్యామలనగర్‌కు చెందిన మందాళ వివేకానందరెడ్డి తొలుత ఈ భూమిని కొనుగోలు చేశారు. తన భూమికి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందని గుర్తించారు. దీనిపై 2024 జూన్ 22వ తేదీన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు ఆట్ల ఈశ్వరమ్మ, బాలకృష్ణారెడ్డి, హరికృష్ణ, గీతాకృష్ణలపై ఈ ఏడాది సెప్టెంబరు 11వ తేదీన పెదకాకాని రిజిస్ట్రార్ డి. భాస్కరరావు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మీరాజ్ తెలిపారు. ప్రస్తుతం ఆ భూమి విలువ రూ.20 కోట్లకు పైగానే పలుకుతోంది.

మాతా, శిశుమరణాలు అరికట్టాలి: కలెక్టర్



బాపట్ల: జిల్లాలో మాతా,శిశు మరణాలు అరికట్టాలని వైద్యాధికారులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్ సూచించారు. మాతా, శిశు మరణాల నివారణ జిల్లా స్థాయి కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. కాన్పుల సమయంలో తల్లులు మృతి చెందకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. అద్దంకి, వేటపాలెం మండలాల్లో గడిచిన 10 నెలల్లో మూడు మాతృ మరణాలు సంభవించడంపై ఆయన సమీక్షించారు. ఓ సంఘటనలో వైద్యాధికారి, ఏఎన్ఎంలపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గర్భిణులకు గుండె సమస్య ఉన్నట్లు గుర్తిస్తే తక్షణమే గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి వారిని తరలించాలని తెలిపారు. ఏడో నెల రాగానే గుండె పరీక్షలు తప్పనిసరిగా చేయాలని చెప్పారు. ప్రజల ప్రాణాలు రక్షించడం కీలక బాధ్యతని, సమర్థంగా పని చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్. విజయమ్మ, ఏపీ వీవీపీ పద్మావతి, డీపీహెచ్ఎన్ఓ సుగుణ, వైద్య అధికారులు పాల్గొన్నారు.

రోడ్డెక్కిన కేళీల బాధిత రైతులు

- ఆదుకుంటామన్న ఎన్‌ఆర్ఐ కంపెనీ
- తీరా రైతులకు మొండి చెయ్యి
- రేపల్లె - తెనాలి రహదారిపై విత్తన బ్యాగులతో రైతుల ఆందోళన
- న్యాయం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులకు వినతిపత్రం

కొల్లూరు: నాసి రకం వరి విత్తనాలతో కష్టాన్ని కబళించిన ఎన్‌ఆర్ఐ విత్తన కంపెనీపై రైతులు కన్నెర్ర జేశారు. తమకు వాటిల్లిన నష్టాన్ని పూడ్చాలని డిమాండ్ చేస్తూ రోడ్డెక్కారు. రేపల్లె - తెనాలి రోడ్డుపై విత్తనాల సంచులతో నిరసన తెలిపారు. ఖరీఫ్‌లో ఎన్‌ఆర్ఐ విత్తన కంపెనీకి చెందిన బీపీటీ 5204 రకం వరి విత్తనాలను పలువురు రైతులు సాగు చేశారు. తాలు కంకెలతో కూడిన కేళీలు రావడంతో ఆర్థిక నష్టం వాటిల్లింది. దీంతో ఆందోళనకు దిగారు. శుక్రవారం మండలంలోని అనంతవరానికి చెందిన రైతులు రేపల్లె - తెనాలి రహదారిపై కొల్లూరు పోలీసు స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. వరి విత్తనాల సంచులను ప్రదర్శిస్తూ, తమకు జరిగిన నష్టాన్ని పూడ్చే విషయంలో కంపెనీ దాటవేత ధోరణిని ఎండగట్టారు.

500 ఎకరాల్లో సాగు

అనంతవరంలో సుమారు 500 ఎకరాల్లో రైతులు బీపీటీ 5204 రకం వరి విత్తనాలు సాగు చేశారు. కాలపరిమితి కంటే ముందే కేళీ కంకులు రావడంతో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారులు ఈనెల 7న పంటను పరిశీలించి కేళీలు ఉన్న మాట వాస్తవమే అని తేల్చారు. ఎన్‌ఆర్ఐ కంపెనీ ప్రతినిధులు కూడా గ్రామానికి వచ్చి పంటను పరిశీలించారు. తాలు గింజలతో కూడిన వరి కంకులు వచ్చిన మాట వాస్తవమేనని నిర్ధారించారు. రైతులతో సంప్రదింపులు జరిపారు. ఈనెల 15 లోపు కంపెనీ ఉన్నత వర్గాల దృష్టికి సమస్యను తీసుకువెళ్లి రైతులకు న్యాయం చేస్తామని భరోసా కల్పించారు. అయితే, గడువు తీరిపోవడంతో రైతులు కంపెనీ ప్రతినిధులను సంప్రదించారు. కంపెనీ నుంచి సాయం అందించే విషయంలో తమకు సంబంధం లేదని చేతులెత్తేయడంతో ఆగ్రహానికి గురయ్యారు.

వ్యవసాయ శాఖ కార్యాలయం ముందు ఆందోళన

కొల్లూరు వ్యవసాయ శాఖ కార్యాలయానికి శుక్రవారం రైతులు తరలివచ్చారు. ఏఓ వి. నరేంద్రబాబును కలసి తమకు తక్షణ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళతామని ఏఓ తెలపడంతో సంతృప్తి చెందని రైతులు కంపెనీకి చెందిన వరి విత్తనాల సంచులతో వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట బైటాయించారు. అనంతరం స్థానిక పోలీసు స్టేషన్ వద్ద రేపల్లె - తెనాలి రహదారిపై ఆందోళనకు దిగారు. అధిక దిగుబడులు వస్తాయని మోసగించిన ఎన్‌ఆర్ఐ విత్తన కంపెనీపై చర్యలు చేపట్టి, తమకు జరిగిన నష్టాన్ని పూడ్చాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ, ఇతర ప్రభుత్వ అధికారులు తక్షణం స్పందించాలని, లేనిపక్షంలో మరోమారు ఆందోళన చేయడానికైనా సిద్ధమనేని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతు, కౌలు రైతు సంఘాల నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, గొల్ల నాగరాజు, బొనిగల సుబ్బారావు, బాధిత రైతులు పాల్గొన్నారు.



కొల్లూరు వ్యవసాయ శాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

కంచే చేను మేసింది !

- సొసైటీ సొమ్ము స్వాహా!
- మూతబడిన పెట్రోలు బంకు
- రూ. 70 లక్షలకు పైగా బ్యాంకు ఖాతా నుంచి మాయం
- పెట్రోలు అమ్మకం లాభాలు కాగితాలకే పరిమితం
- నిధుల గోల్‌మాల్‌పై త్రిసభ్య కమిటీ ఆరా
- వెలుగులోకి వచ్చిన సీఈఓ అవినీతి

పర్చూరు(చినగంజాం): సహకార సొసైటీలు అవినీతి కూపంలో మునిగిపోతున్నాయి. రైతుల సొమ్ముకు కాపాలాగా ఉండాల్సిన వారే అడ్డదారులు తొక్కుతున్నారు. పర్చూరు మండలంలోని అడుసుమల్లిలో అడుసుమల్లి విశాల సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో పెట్రోలు బంకు నడుస్తోంది. ఆయిల్ సరఫరా చేసిన కంపెనీలకు బకాయిల చెల్లించకపోవడంతో నెల రోజులుగా మూతబడింది. సహకార పరపతి సంఘం నిధులు పక్కదారి పట్టడమే దీనికి కారణం. పెట్రోలు బంకు నిర్వహణ కోసం బ్యాంకు నుంచి సెక్యూరిటీ డిపాజిట్ కింద తీసుకున్న రూ. 70 లక్షలను ఓ మాజీ సీఈఓ పక్కదారి పట్టించాడు.

వందల సంఖ్యలో రైతులు

అడుసుమల్లి విశాల సహకార పరపతి సంఘం (పీడీసీసీ)కింద వేల ఎకరాల్లో భూములున్నాయి. వందల సంఖ్యలో రైతులున్నారు. సంఘం పరిధిలో అడుసుమల్లి, దేవరపల్లి, తన్నీరు వారిపాలెం, గొల్లపూడి, ఇనగల్లు, తిక్కరాజుపాలెం గ్రామాలున్నాయి. రైతులందరికీ పంట రుణాలు, చెల్లింపులు, పొదుపు వంటి సేవలందించేందుకు సొసైటీ ఎంతగానో ఉపయోగపడుతోంది. సొసైటీ తరపున 2022 డిసెంబరులో అడుసుమల్లిలో నాబార్డు, ఆప్‌కాబ్ సహకారంతో పెట్రోలు బంకు ప్రారంభించారు.

ఓవర్ డ్రాఫ్ట్ కింద రుణం

బంక్ నిర్వహణ నిధుల కోసం సీఈఓ డిపాజిట్ బ్యాండ్‌లను ష్యూరిటీగా పెట్టి రైతుల సెక్యూరిటీ డిపాజిట్ నుంచి మొదట రూ. 40 లక్షలు, తర్వాత రూ. 30 లక్షలు కలిపి రూ. 70 లక్షలను ఓవర్ డ్రాఫ్ట్ కింద రుణం తీసుకున్నాడు. మూడు సంవత్సరాలు సాఫీగా సాగిన పెట్రోలు బంకుకు ఆ తర్వాత కష్టాలు వచ్చి పడ్డాయి. రూ. 40 లక్షలు బకాయి ఉన్నారని, చెల్లించకపోతే ఆయిల్ సరఫరా నిలిపివేస్తామని హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ హెచ్చరించింది. ఈ క్రమంలో ఇటీవల కొత్తగా ఏర్పడిన త్రిసభ్య కమిటీ దృష్టికి సమస్య రావడంతో సీఈఓను ఆరా తీశారు. ఆయిల్ కంపెనీ బకాయి రూ. 40 లక్షల్లో రూ. 20 లక్షలు చెల్లించారు. అయితే, బ్యాంకులో సెక్యూరిటీ డిపాజిట్ ఖాతాలో రూ. 8 వేలు మాత్రమే ఉన్నాయి. మిగిలిన రూ. 20 లక్షలను చెల్లించలేమని కొత్తగా ఏర్పడిన కమిటీ చేతులెత్తేసింది.



సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బంకు

లాభాలు కాగితాలకే పరిమితం

బ్యాంకులో సెక్యూరిటీ డిపాజిట్ కింద నగదు కూడా మాయమైనట్లు త్రిసభ్య కమిటీ గుర్తించింది. ఆయిల్ కంపెనీలకు నగదు చెల్లింపు, జీతాలు, ఇతర ఖర్చులు పోను మూడేళ్ల పాటు వచ్చే లాభం రూ. 30 లక్షలు, ఓవర్ డ్రాఫ్టు కింద తీసుకున్న నగదు రూ. 70 లక్షలు ఖాతాలో లేక పోవడంతో సభ్యులు విస్తు పోయారు. ఈ విషయమై త్రిసభ్య కమిటీ సీఈఓను ఆరాతీయగా కేవలం కాగితాలపై రూ. 30 లక్షలు లాభాలను చూపడం గమనార్హం. బకాయి రూ. 20 లక్షలు నగదు చెల్లించలేని పరిస్థితిలో బంకును మూసి వేయాల్సి వచ్చిందని త్రి సభ్య కమిటీ చైర్మన్ పోపూరి శ్రీనివాసరావు తెలియజేశారు.

సీఈఓ భర్త సస్పెన్షన్

ప్రస్తుతం సొసైటీ సీఈఓగా పని చేస్తున్న మహిళ భర్త గతంలో సీఈఓగా పనిచేసి అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడంతో సస్పెన్షన్‌లో ఉన్నాడు. అయితే, పలుకుబడితో భార్యను సీఈఓగా నియమించుకున్నాడు. అతను సూపర్‌వైజర్‌గా విధుల్లో చేరాడు. అయితే, ఈ పోస్టులో కూడా సస్పెండ్ అయినట్లు తెలిసింది.

ఆరోపణలపై విచారణకు ఆదేశం

అడుసుమల్లి విశాల సహకార పరపతి సంఘం సొసైటీలో అవకతవకలు జరిగాయంటూ ఆరోపణలు రావడంతో జిల్లా సహకార అధికారి సీహెచ్ శ్యాంసన్ విచారణకు ఆదేశాలు జారీ చేశారు. అడుసుమల్లి సొసైటీ సభ్యుడు, త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా ఎంపికైన పోపూరి శ్రీనివాసరావు సీఈఓ రమాదేవిపై సెప్టెంబర్ 24వ తేదీన పలు అంశాలపై ఆరోపణలు చేశారు. దానిపై విచారణ నిర్వహించాలని ఈ నెల 14న జిల్లా సహకార అధికారి ఆదేశాలు ఇచ్చారు. విచారణను మూడు నెలల్లోగా పూర్తి చేసి నివేదిక ఇవ్వాలని ఆయన ఆదేశించారు.

రైతుల పేరిట బకాయిలు

రూ. 70 లక్షలు సెక్యూరిటీ డిపాజిట్ సొమ్ము వాడుకునేందుకు అడుసుమల్లి సీఈఓకు పర్చూరు సహకార బ్యాంక్ మేనేజర్ అనుమతి ఇవ్వడం ఆశ్చర్యంగా ఉంది. మూడేళ్లలో వచ్చిన లాభం ఏమైందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. ఆయిల్ కంపెనీలకు కట్టకుండా బకాయి పెట్టడంతో అనుమానం వచ్చి ప్రశ్నించడంతో బండారం బయటపడింది. రైతులు రుణాలు చెల్లించినప్పటికీ వారు బకాయి ఉన్నారంటూ చూపడంతో ఆందోళన మొదలైంది. కొందరు రైతులు చనిపోయిన వారి పేరుతో కూడా రుణం తీసుకున్నట్లు తెలిసింది. లెక్క చెబితేనే కమిటీ నిర్వహణకు సాధ్యమని సీఈఓ, బ్యాంకు అధికారులకు తెలియజేశా !

– పోపూరి శ్రీనివాసరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు, జరిమానా

- తీర్పు వెలువరించిన ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి భారతి

సంతమాగులూరు(అద్దంకి): హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు, రూ.8వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి భారతి తీర్పునిచ్చారు. వివరాలు.. సంతమాగులూరులోని బీసీ కాలనీకి చెందిన రావూరి వెంకట నారాయణ, అంకమ్మ భార్యాభర్తలు. ఒక కుమారుడు ఉన్నాడు. మనస్పర్థలు రావడంతో అంకమ్మ భర్తను వదిలి వెళ్లిపోయింది. కాగా మృతురాలు మరియమ్మకు మొదట వివాహం జరిగింది. అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. ఆమె కూడా భర్తతో విడిపోయింది. ఈ క్రమంలో రావూరి వెంకట నారాయణతో పరిచయం కాగా ఇద్దరూ వివాహం చేసుకున్నారు. అయితే, కొంత కాలం నుంచి నిందితుడు వెంకట నారాయణ తన రెండో భార్య మరియమ్మపై అనుమానం పెంచుకున్నాడు. దీనిపై తరచూ ఆమెతో గొడవ పడుతూ ఉండేవాడు. పద్ధతి మార్చుకోక పోతే చంపేస్తానని బెదిరిస్తూ ఉండేవాడు. కాగా 31 డిసెంబర్ 2021 రాత్రి 8 గంటల సమయంలో మరియమ్మ ఇంట్లో లేకపోవడాన్ని గమనించాడు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకు ఇంటికి రాగానే నిందితుడు ఆమెతో గొడవకు దిగాడు. ఒక్కసారిగా ఇంట్లో ఉన్న సుబాబుల్ కర్ర నరికే కత్తితో ఆమెను హతమార్చాడు. శవాన్ని భుజాన వేసుకొని, గ్రామ సమీపంలోని పంట కాలువలో పడేసి వచ్చాడు. ఆ తర్వాత గ్రామంలో జరుగుతున్న నూతన సంవత్సర వేడుకల వద్దకు వచ్చాడు. వెంకట నారాయణ వాలకం గమనించిన అతని అల్లుడు రాచూరి ప్రసన్న మరికొంత మంది ప్రశ్నించగా, మరియమ్మను హత్య చేసినట్లు చెప్పాడు. ప్రసన్న ఫిర్యాదు మేరకు అప్పటి సంతమాగులూరు పోలీసులు అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో వెంకటనారాయణకు జీవిత ఖైదుతో పాటు రూ. 5వేల జరిమానా, సాక్ష్యాలు కనుమరుగు చేసిన నేరానికి రూ. 3వేలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.



నేరస్తుడితో పోలీసులు

తల్లిదండ్రుల చెంతకు బాలిక



చీరాల: చిన్న చిన్న కారణాలతో తల్లిదండ్రులతో విభేదించి బయటకు రావడం సరైన పద్ధతి కాదని వన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. చీరాల పట్టణంలో శుక్రవారం కొట్ల బజారులో ఒంటరిగా తిరుగుతున్న 17 సంవత్సరాల బాలికను శక్తి టీం సభ్యులు గుర్తించారు. సూట్‌కేస్‌తో ఒంటరిగా ఉండటంతో సామరస్యంగా మాట్లాడి వివరాలను సేకరించారు. ఇంటిలో తల్లిదండ్రులతో గొడవ పడి బయటకు వచ్చేశానని, ఇంటికి వెళ్లనని, ఒంటరిగానే బతుకుతానని చెప్పడంతో బాలికను చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకు వచ్చారు. మహిళా ఎస్ఐ రాజ్యలక్ష్మి సమక్షంలో బాలిక తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలపై శ్రద్ధ వహించాలని సీఐ తెలిపారు. శక్తి టీం సిబ్బంది బాలికను సరైన సమయంలో గుర్తించడం వల్ల తల్లిదండ్రుల చెంతకు సురక్షితంగా చేర్చామని, లేనిపక్షంలో ఆమె దూర ప్రాంతానికి వెళ్లే అవకాశం ఉందని చెప్పారు. శక్తి టీం సిబ్బంది శివకుమారి, కానిస్టేబుల్ సుబ్బారావు, మహిళా కానిస్టేబుల్ సునీత, సీఐ ఎస్.సుబ్బారావు, ఎస్ఐ రాజ్యలక్ష్మిని ఎస్పీ ఉమామహేశ్వర్ అభినందించారు.

బీచ్‌ల్లో ఈత నిషేధం

- ఎస్పీ బి.ఉమామహేశ్వర్
- మద్యం తాగి సముద్రంలోకి దిగితే చర్యలు
- సూచించిన ప్రదేశాల్లో మాత్రమే స్నానాలు
- నిత్యం పెట్రోలింగ్ ముమ్మరం

బాపట్ల: బీచ్‌ల్లో ఈత నిషేధించినట్లు జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ప్రకటించారు. మద్యం తాగి సముద్రంలోకి దిగడానికి వీల్లేదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం బాపట్ల జిల్లా సముద్ర తీర ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బాపట్ల జిల్లా ప్రధానమైన పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని పేర్కొన్నారు. పిడుగురాళ్ల నుంచి వాడరేవు వరకు నిర్మిస్తున్న 167ఏ జాతీయ రహదారి పనులు త్వరలోనే పూర్తికానున్నాయని తెలిపారు. ఆ రహదారి అందుబాటులోకి వస్తే తెలంగాణ నుంచి ఎక్కువ సంఖ్యలో పర్యాటకులు వాడరేవు, రామాపురం బీచ్ తదితర సముద్ర తీరాలకు వచ్చే అవకాశం ఉందని చెప్పారు. సూర్యలంక సముద్ర తీరంలో పర్యాటకంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయని తెలిపారు. నిజాంపట్నం వైపు నిర్మిస్తున్న రహదారి పూర్తయితే ఆ మండలంలోని సముద్ర తీరాలకు యాత్రికులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వీటన్నింటిని దృష్టిలోఉంచుకొని, ఇటీవల చోటుచేసుకున్న విషాదకర ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భౌగోళికంగా చూసుకుంటే నిజాంపట్నం నుంచి చిన్నగంజాం మండలం వరకు బాపట్ల జిల్లాకు విశాలమైన సముద్రతీరం ఉందని తెలిపారు. ఎక్కడపడితే అక్కడ యాత్రికులు సముద్రంలోకి దిగి స్నానాలు ఆచరించకుండా తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ సూచించిన ప్రదేశాల్లోనే యాత్రికులు స్నానాలు ఆచరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అడ్రెసింగ్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు యాత్రికులను అప్రమత్తం చేస్తూ ఉండాలని చెప్పారు. కార్తిక స్నానాల నేపథ్యంలో పటిష్ట భద్రత ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో రేపల్లె డీఎస్పీ ఏ. శ్రీనివాసరావు, బాపట్ల డీఎస్పీ జి. రామాంజనేయులు, చీరాల డీఎస్పీ ఎండీ. మోయిన్, డీసీఆర్బీ డీఎస్పీ బాలమురళీకృష్ణ, జిల్లా ఎస్బీ ఇన్‌స్పెక్టర్ జి. నారాయణ, రేపల్లె రూరల్ సీఐ పి. సురేష్ బాబు, బాపట్ల రూరల్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కె. శ్రీనివాసరావు, చీరాల రూరల్ సీఐ శేషగిరిరావు, ఇంకొల్లు సీఐ వై.వి. రమణయ్య, నిజాంపట్నం, అడవులదీవి, చీరాల రూరల్, చిన్నగంజాం ఎస్ఐలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,500** గరిష్ఠం : రూ. **2,200**

మోడల్ ధర రూ. **1,800**

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	37,368
అమ్మకాలు	42,710
నిల్వ	6,578

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-15,000
నంబరు-5	10,000-14,500
273	10,500-13,800
341	10,000-15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,000
నంబరు-5	10,000-14,800
341	10,000-15,800
4884	10,000-14,000
సూపర్-10	10,000-14,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,300
బాడిగ-355	10,500 - 15,600
దేవనూరు డీలక్స్	10,000 - 14,700
ఆర్మూర్	10,000 - 12,600
తాలుకాయలు	5,500 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,200
దేవనూరు డీలక్స్	10,500-14,800
తాలు	5,300 - 8,000

-కొరిటిపాడు (గుంటూరు)

ఇంటింటికీ తాగునీరు సరఫరానే లక్ష్యం

జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

బాపట్ల: జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేయాలని కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ ఆదేశించారు. గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 265 గ్రామాల్లో 3.64 లక్షల కుటుంబాలు నివసిస్తున్నారని తెలిపారు. ఇందులో ప్రస్తుతం 1.48 లక్షల ఇళ్లకు మాత్రమే కుళాయి కనెక్షన్లు ఉన్నాయని, ఇంకా 2,15,808 ఇళ్లకు ఇవ్వాలని ఆయన పేర్కొన్నారు. డిసెంబర్ 31వ తేదీ నాటికి 4,493 కనెక్షన్లు ఇవ్వాలని చెప్పారు. 369 చిన్న చెరువులు, మధ్యస్త చెరువులు 25తో పాటు 5,083 చేతి పంపులు ఉన్నాయని వివరించారు. తాగునీటి ప్రాజెక్టులు సమర్థంగా నిర్వహణ, పర్యవేక్షణకు జిల్లా, గ్రామీణ స్థాయిలో కమిటీలు పని చేస్తున్నాయని తెలిపారు. 2028 నాటికి తలసరి 55 లీటర్ల నీటిని సరఫరా చేయాలనే లక్ష్యంతో జలజీవన్ మిషన్ కింద పనులు జరుగుతున్నాయని వివరించారు. జలజీవన్ మిషన్ 64 పనులను ప్రారంభించని ఏజెన్సీలకు నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. రెండు వారాల్లో ప్రారంభించాలని చెప్పారు. రూ.167.48 కోట్లతో మంజూరు చేసిన 403 పనులను గడువులోగా పూర్తి చేయాలని, పురోగతిలో ఉన్న 277 పనులను ఆరు నెలల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. జల వనరుల సంరక్షణలో భాగంగా పంట కుంటలు, నీటి కుంటలు, ఇంకుడు గుంతలను విరివిగా తవ్వాలని సూచించారు.

మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలి

చెరువులు, పైపులైన్ల మరమ్మతుల కోసం రూ.9.94కోట్లు మంజూరు చేయాలని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓలను కలెక్టర్ కోరారు. దీనివల్ల గ్రామీణ ప్రాంత ప్రజలకు నీటి సరఫరా సజావుగా సాగుతుందని వివరించారు. ప్రస్తుతం 40 శాతమే కుళాయి కనెక్షన్ల ద్వారా తాగునీరు సరఫరా అవుతున్న నేపథ్యంలో తప్పనిసరిగా జలజీవన్ మిషన్ పనులు చేపట్టాలని ఆయన ఆదేశించారు. తాగునీటి పథకాల మరమ్మతులకు గ్రామ పంచాయతీ నిధులు లేకపోతే మండల పరిషత్ నిధులను తప్పనిసరిగా కేటాయించాలని ఆయన సూచించారు.

మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలను పూర్తి చేయాలి

సామాజిక మరుగుదొడ్లు జిల్లాలో 406 మంజూరు కాగా, 223 మాత్రమే పూర్తయ్యాయని, మిగిలిన వాటిని పూర్తిచేయాలని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో 18,288 ఇళ్లకు మరుగుదొడ్లు లేకపోవడంపై ఆరా తీశారు. యుద్ధప్రాతిపదికన మంజూరు చేయాలని చెప్పారు. 342 సామాజిక మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.10.26 కోట్లు మంజూరయ్యాయని, పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 79 అంగన్‌వాడీ కేంద్రాల్లో సామాజిక మరుగుదొడ్లు నిర్మాణానికి రూ.28.4 లక్షలు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వాడిన నీటిని శుద్ధి చేసే ప్లాంట్ ఏర్పాటుకు అద్దంకి నియోజకవర్గంలోని మార్టూరు గ్రామాన్ని ఎంపిక చేశామని కలెక్టర్ చెప్పారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ అనంతరాజు, అనుబంధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఇసుక కొరత లేకుండా చర్యలు

ప్రజల అవసరాలకు ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో శుక్రవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లాలో అందుబాటులో గల ఇసుక రీచ్ వివరాలపై కలెక్టర్ ఆరా తీశారు. వర్షాకాలం పూర్తవుతున్నందున జిల్లాలో కొత్త రీచ్‌లను అన్వేషించాలని తెలిపారు. ఓలేరు రీచ్‌పై కోర్టు కేసును త్వరగా పూర్తి చేసుకుని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. అనుమతులు వచ్చిన వెంటనే జువ్వలపాలెం రీచ్ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని ఆయన అధికారులు సూచించారు. ఇసుక సరఫరా చేసే వాహనాల రిజిస్ట్రేషన్, జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలని ఆర్టీవోకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి గంగాధర్ గౌడ్, గనుల శాఖ సహాయ సంచాలకులు రామచంద్ర, జిల్లా రవాణా అధికారి పరంధామరెడ్డి, చీరాల ఆర్డీవో చంద్రశేఖర్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమయస్ఫూర్తితో ఆటల్లో విజయం

కర్లపాలెం: క్రీడాకారులు సమయస్ఫూర్తితో ఆడి విజయం సాధించాలని డీఈవో పురుషోత్తం తెలిపారు. మండలంలోని యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బాపట్ల డివిజన్ స్థాయిలో 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డీఈవో పురుషోత్తం ముందుగా వాలీబాల్ క్రీడాకారులను, వ్యాయామ ఉపాధ్యాయులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు గెలుపే ధ్యేయంగా ఆడాలని సూచించారు. నిష్పక్షపాతంగా పోటీలు నిర్వహించాలని వ్యాయామ ఉపాధ్యాయులకు చెప్పారు. పోటీల్లో మెరుగైన ప్రతిభ కనబరిచిన వారిని డివిజన్ స్థాయి టీమ్‌కు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సుగుణ మణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు మెర్సీ, ఎంఈవోలు మనోరంజని, విజయశ్రీ, స్కూల్ గేమ్ ఫెడరేషన్ మాజీ కార్యదర్శి కరిముల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రతిమ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పోటీల్లో పాల్గొన్న 40 టీములు

బాపట్ల డివిజన్ పరిధిలోని మొత్తం 12 మండలాల నుంచి అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాలలో మొత్తం 40 టీమ్‌లు పాల్గొన్నాయి.

- అండర్-14 బాలుర విభాగంలో కర్లపాలెం టీమ్ విజేత కాగా బాపట్ల టీమ్ రన్నరప్‌గా నిలిచింది.
- బాలికల విభాగంలో పిట్టలవానిపాలెం టీమ్ విజయం సాధించగా, భట్టిప్రోలు టీమ్ రన్నరప్‌గా నిలిచింది.
- అండర్-17 బాలుర విభాగంలో బాపట్ల టీమ్ విజయం సాధించగా పిట్టలవానిపాలెం టీమ్ రన్నరప్‌గా నిలిచింది.
- బాలికల విభాగంలో పిట్టలవానిపాలెం టీమ్ విజయం సాధించగా బాపట్ల టీమ్ రన్నరప్‌గా నిలిచింది.



యాజలి ఉన్నత పాఠశాలలో వాలీబాల్ క్రీడాకారులతో డీఈవో పురుషోత్తం, వ్యాయామ ఉపాధ్యాయులు

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఆధిపత్య పోరు, పాత కక్షలే కారణమని డీఎస్పీ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్: తెనాలిలో పట్టపగలు నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటనలో నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు కేసు వివరాలను వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు(60) ఈ నెల 14న పట్టణంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. తిరుపతిరావు గ్రామంలోని రామాలయం పాలకవర్గంలో కీలకంగా ఉన్నాడు. ఆలయ చెరువుల వేలం పాటల నిర్వహణ బాధ్యత చూసేవాడు. 15 రోజుల క్రితం జ్వరం రావడంతో తిరుపతిరావు భార్యతో కలసి తెనాలిలో నివాసం ఉంటున్న కుమార్తె గండికోట దుర్గ ఇంటికి వచ్చాడు. ఈ నెల 14న టిఫిన్ కోసం బైక్‌పై ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సమీపంలో టిఫిన్ సెంటర్ వద్ద బైక్‌పై కూర్చున్నాడు. అదే సమయంలో కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన గండికోట వెంకటసుబ్బారావు వచ్చి కొబ్బరి బొండాల కత్తితో విచక్షణరహితంగా దాడి చేసి పారిపోయాడు. తిరుపతిరావుతో నిందితుడికి కొంతకాలంగా విభేదాలున్నాయి. నిందితుడి వ్యక్తిగత విషయాలలోనూ తిరుపతిరావు జోక్యం చేసుకున్న కారణంగా కక్ష పెంచుకొని ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఆలయ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించడం, గతంలో తన తండ్రి మృతికి కూడా తిరుపతిరావు కారణమయ్యాడని భావించి రెక్కీ నిర్వహించి మరీ హత్యకు పాల్పడ్డాడు. నిందితుడిపై పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో మూడు కేసులు, అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. తిరుపతిరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కంచర్లపాలెం రోడ్డులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ ఎస్. సాంబశివరావు, త్రీ టౌన్ ఎస్ఐ కరిముల్లా, రూరల్ ఎస్ఐ కె. ఆనంద్, సిబ్బంది పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నీలో క్రీడాకారిణుల ప్రతిభ



క్రీడాకారిణులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారు లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల కబడ్డీ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. వివిధ కళాశాలల జట్లు ప్రతిభ చాటాయి. నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తెనాలి జె.ఎం.జె. డిగ్రీ కళాశాల, గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ సైన్స్ విభాగం, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలు వరుసగా తొలి నాలుగు స్థానాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. అనంతరం బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యోగా కోఆర్డినేటర్ డాక్టర్ డి. సూర్యనారాయణ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, చలపతి విద్యా సంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తదితరులు విజేతలను అభినందించారు.

విలువలతో కూడిన నాయకత్వం అవసరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి

చేబ్రోలు: విద్య కేవలం జ్ఞాన సంపాదనకే కాకుండా విలువలతో కూడిన నాయకత్వం పెంచుకోవడానికి కూడా ముఖ్యమని ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్‌రెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో "కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్"పై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ నేటి యువత వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్నప్పుడు సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలే మార్గదర్శకాలు కావాలని సూచించారు. ఉస్మానియా వర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎ. సూర్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక సంస్థల్లో ఎదురయ్యే నైతిక సమస్యలను ఆచరణాత్మక కోణంలో విశ్లేషించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు భారతీయ తత్వశాస్త్ర సంప్రదాయాల ప్రాధాన్యతను నైతిక నాయకత్వ అభివృద్ధితో అనుసంధానించి వివరించారు. ఐఐటీ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం.పి.గణేష్ ఆధునిక అభివృద్ధి తత్వాలతోపాటు ప్రాచీన భారతీయ జ్ఞానాన్ని సమన్వయం చేయడం ఎంత అవసరమో వెల్లడించారు. వంద మందికిపైగా ప్రతినిధులు పరిశోధన పత్రాలను సమర్పించారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు జిల్లా వాసులకు పదవులు

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పలువురు నాయకులను వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా నరసరావుపేటకు చెందిన గెల్లి బ్రహ్మారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, గురజాలకు చెందిన కలకంధ అంద్రయ్యను యాక్టివిటీ సెక్రటరీగా నియమితులయ్యారు. నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షులుగా కంద్రకుంట మరియమ్మను నియమించారు.

28న ధర్నాను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏడీ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పి నేటికీ అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలు రూ.203 కోట్లను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వల్ల ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చేనేత రక్షణకు 11 రకాల రిజర్వేషన్లు అమలు జరపాలని కోరారు. చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలన్నారు. చేనేత కార్మికులకు, సహకార సంఘాల్లో లేనివారికి ఇవ్వాల్సిన త్రిఫ్ట్ ఫండ్ రూ.27 కోట్లను కూడా విడుదల చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి

- డీఈవో చంద్రకళ
- ఘనంగా జిల్లా సైన్స్ సెమినార్



బహుమతులు సాధించిన విద్యార్థులతో డీఈవో చంద్రకళ

నరసరావుపేట రూరల్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా 30 నమూనాలను విద్యార్థులు పోటీలో ప్రదర్శనకు ఉంచారు. కాకాని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వక్కలగడ్డ కాత్యాయనీ ప్రథమ స్థానం, నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కోడిరెక్క ఇమ్మానియేల్‌కు ద్వితీయ స్థానం లభించింది. ఈ రెండు నమూనాలను శనివారం విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఎస్‌కె సుభాని, సత్తెనపల్లి డీఈవో ఏసుబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.పార్వతి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్, ఉపాధ్యాయులు రఘురాం, చింత శ్రీనివాసరెడ్డి, మధుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

స్వదేశీ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి



గుంటూరు మెడికల్: స్వదేశీ ఉద్యమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. శుక్రవారం మంగళగిరి హాయ్‌లాండ్‌లో బీజేపీ అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులకు కార్యశాల జరిగింది. ముఖ్య అతిథిగా పీవీఎన్.మాధవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితర నేతలు మాట్లాడారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం అందిస్తున్నామని తెలిపారు. మెడికల్ కళాశాలలను అందుబాటులోకి తెస్తే ప్రజలకు మంచి జరుగుతుందని పేర్కొన్నారు.

ఆగివున్న లారీని ఢీకొన్న ఆటో

- హస్తకళల డిజైనర్ మృతి
- హాస్టల్ వార్డెన్‌కు తీవ్ర గాయాలు

మాచర్ల రూరల్: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న హస్తకళల డిజైనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మాచర్ల మండలం తాళ్లపల్లి కుడి కాలువ సమీపంలోని మాచర్ల-సాగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. కొత్తూరులోని హస్తకళల వారికి శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ట్రైనర్‌లు ఎస్.సుగుణరాజు, ఫిలిప్, వంగడ రమేష్ కొత్తూరు నుంచి పోచం నర్సింహారావు అనే వృద్ధుడు ఆటోలో మాచర్ల బయలుదేరారు. ఏడో మైలులోని గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డన్ నాగ మల్లీశ్వరి, మరో వ్యక్తి కూడా ఆటో ఎక్కారు. తాళ్లపల్లి సమీపంలోకి రాగానే రోడ్డుపై నిలిచి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న హస్తకళల ట్రైనర్ ఎస్.సుగుణరాజు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. వార్డెన్ నాగ మల్లీశ్వరికి, ట్రైనర్ ఫిలిప్‌కు తీవ్ర గాయాలుకాగా వంగడ రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సుగుణరాజుకు వివాహం కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అమరావతి అధ్యక్షుడిగా బెజ్జం అశోక్



తాడికొండ: ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అమరావతి యూనిట్ అధ్యక్షుడిగా బెజ్జం అశోక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తాడికొండ రూరల్ హెల్త్ సెంటర్‌లో తాడికొండ, తుళ్లూరు, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలకు కలిపి యూనిట్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బి.కృష్ణ కిషోర్, సహాయ ఎన్నికల అధికారిగా కె. శేషగిరి రాజు వ్యవహరించారు. ఎన్నికల పరిశీలకుడిగా కె. విజయ్ బాబు వ్యవహరించారు. అమరావతి యూనిట్ అధ్యక్షుడిగా బెజ్జం అశోక్ కుమార్, సహ అధ్యక్షుడిగా కె. రవిబాబు, ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, ఎ. లలిత కుమారి, ఇ. చంద్రబాబు, పి. మల్లికార్జున రావు, మహిళా ఉపాధ్యక్షులుగా సీహెచ్ శారదా దేవి, కార్యదర్శిగా షేక్ అబ్దుల్ కరీం, కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ డి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా వి. రామాంజనేయులు, డి.అరుణకుమార్, బి.రాంబాబు, పి.అంకమ్మరావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎం.నాగమణి, కోశాధికారిగా ఎ.పూర్ణయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎన్. ఏసునాథరావులు ఎన్నికయ్యారు. అభినందన సభకు ముఖ్య అతిథులుగా ఏపీఎన్జీజీవో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ హాజరయ్యారు. సభ్యులను పూలమాలలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.డి. నాయక్, ఎస్.వెంకటరెడ్డి సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు మణిరావు, అమరావతి యూనిట్ మాజీ అధ్యక్షుడు రావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చలో.. సూర్యలంక !

- 22నుంచి కార్తిక మాసం ప్రారంభం
- ఆహ్లాదకరం సూర్యలంక తీరం
- వన భోజనాలకు జీడిమామిడి తోటలు అనువు
- హరితా రిసార్ట్స్‌లో బస సౌకర్యం

కార్తిక మాసం అనగానే మనుష్యుల మధ్య ఐకమత్యం, ప్రకృతితో మనిషికి గల అవినాభావ సంబంధాన్ని తెలిపే వన భోజనాలు గుర్తు కొస్తాయి. పచ్చ పచ్చని వనాల్లో సేద తీరడంతో భవిష్యత్‌పై ఆశలు పుడతాయి. సమష్టి తత్వం బోధ పడుతుంది. దైనందిన జీవితంలో ఆశ, నిరాశలు, ఒత్తిడి, బాధ్యతల బరువుతో సతమతమయ్యే మనిషికి కార్తిక మాసంలో చేసే వన భోజనాలు ఆటవిడుపుగా ఉంటాయి.



సూర్యలంక తీరం (ఫైల్)

బాపట్ల: కార్తిక మాసం వచ్చిందంటే చాలు అందరి కళ్లు జిల్లాలోని సూర్యలంక తీరం పైనే ఉంటాయి. ఈ నెల 22 నుంచి కార్తీక మాసం ప్రారంభం కానుంది. రాష్ట్రంలోనే సహజసిద్ధమైన తీరంగా పేరున్న సూర్యలంకకు కార్తిక మాసంలో పర్యాటకులు, భక్తులు అధిక సంఖ్యలో వస్తారు. సముద్ర స్నానాలు చేసి, తీరానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఫారెస్ట్ భూమిలో ఉన్న జీడి మామిడి తోటలో వన భోజనాలు చేస్తారు. వననర్సరీ చాలా అనువుగా ఉంటుంది. స్నానాల నంతరం పూజలు చేసుకునేందుకు వీలుగా తీరం వెంబడే ఆంజనేయస్వామి దేవాలయం ఉంది.

చేరుకునేది ఇలా...

బాపట్ల నుంచి తొమ్మిది కిలోమీటర్ల దూరంలో ఉన్న సూర్యలంక సముద్ర తీరానికి వెళ్లేవారు ముందుగా పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయం వద్దకు చేరుకోవాలి. అక్కడి నుంచి ఆటో సర్వీసులు అందుబాటులో ఉంటాయి. బాపట్ల నుంచి నేరుగా సూర్యలంక వరకు వెళ్తుంటాయి. ఒక్కో మనిషికి రూ.20 చార్జీ ఉంటుంది. సర్వీసులు ఉదయం ఆరు గంటల నుంచి సాయంత్రం 9 గంటల వరకు అందుబాటులో ఉంటాయి. కార్తిక మాసంలో వచ్చే ప్రతి ఆది, సోమవారాల రోజున బాపట్ల నుంచి ఆర్టీసీ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. రైలు మార్గాన వచ్చే వాళ్లకు స్థానిక రైల్వేస్టేషన్ నుంచి నేరుగా సూర్యలంకకు, బస్సు మార్గాన వచ్చే వాళ్లకు బాపట్ల పాత బస్టాండ్ నుంచి ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయి. ఇతర జిల్లాల నుంచి వచ్చే పర్యాటకుల సౌకర్యార్థం గుంటూరు బస్ స్టేషన్ నుంచి కూడా నేరుగా బస్సులు అందుబాటులో ఉంటాయి.



తీరం ఒడ్డున హరితా రిసార్ట్స్

రిసార్ట్స్‌లో వసతి సౌకర్యం

సహజ సిద్ధమైన సూర్యలంక తీరంలో ఆహ్లాదకరమైన వాతావరణంతో పాటు, పర్యాటకులు సేదతీరేందుకు వీలుగా తీరం ఒడ్డున హరితా రిసార్ట్స్ ఉన్నాయి. ఇందులో 25 ఏసీ రూమ్‌లు, రెండు నాన్ ఏసీ రూమ్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని ఆన్‌లైన్‌లో aptdc. gov. in అనే వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. పర్యాటకుల సౌకర్యార్థం తీరం వెంబడి రెస్టారెంట్, గ్రూపు యాత్రికుల కోసం క్యాటరింగ్ సౌకర్యం, టూరిస్టు బోటు , తీరం వెంబడే జిమ్ సెంటర్‌ను కూడా నిర్వహిస్తున్నారు.